Name of the Publication: Andhra Jyothi News Paper
Date: 19.09.2017
Page No: 13
Edition: Hyderabad
Headline: Indo UK Institute of Health (IUIH) a step forward to construct biggest Hospital near Ibrahimpatnam Kongara Kalan, RR district.

Tuesday, September 19, 2017 | www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి ABN We Report You Decide

# వెయ్యి కోట్లతో మరో భారీ ఆస్పత్రి

- 1000 పడకలతో ఏర్పాటు
- అనుబంధంగా మెడికల్, నర్సింగ్ కాలేజీలు
- నగర శివార్లలో నిర్మాణం
- ముందుకు వచ్చిన ఐయూఐహెచ్
- నవంబర్‌లో ప్రధానితో శంకుస్థాపన

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మరో పెద్ద ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. సుమారు వెయ్యి కోట్ల వ్యయంతో 1000 పడకల ఆస్పత్రిని నెలకొల్పడానికి ఇండో యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఐయూఐహెచ్)ముందుకు వచ్చింది. ఆస్పత్రితో పాటు 150 సీట్ల మెడికల్ కాలేజీ, 200 సీట్లతో కూడిన నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ చివరివారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఆస్పత్రికి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించడానికి ఐయూఐహెచ్ ప్రతినిధులు రెండు రోజుల్లో హైదరాబాద్‌కు రానున్నారు. వీరి పర్యటన వివరాలు ఇప్పటికే రాష్ట్ర వైద్య శాఖ అధికారులకు అందినట్లు సమాచారం. ఇందులో భాగంగా వారు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో భేటీ అయి ఆస్పత్రి శంకుస్థాపనకు ఆహ్వానించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండేళ్ల క్రితం భారత్-యూకే ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం భారతదేశంలోని పదకొండు రాష్ట్రాల్లో 11 ఆస్పత్రులు, 89 డయాగ్నస్టిక్ క్లినిక్‌లను నెలకొల్పాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా హైదరాబాద్ నగర శివారులోని ఇబ్రహీంపట్నం కొంగరకలాన్ గ్రామ పరిధిలో వెయ్యి పడకల ఆస్పత్రిని నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి వీలుగా ఇప్పటికే టీఎస్ఐఐసీ 50 ఎకరాల భూమిని కూడా కేటాయించింది. వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మించే ఈ ఆస్పత్రి పనులకు నవంబర్ చివరి వారంలో ప్రధాన మంత్రి ఈ ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆస్పత్రిలో భాగంగా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలతో పాటు పరిశోధనల కోసం ప్రత్యేకంగా ఒక రీసెర్చ్ బ్లాకును నిర్మించనున్నారు. భారీ ఆడిటోరియం, అంతర్జాతీయ స్థాయి లైబ్రరీ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే 20 శాతం పడకలను బీపీఎల్‌కు దిగువ ఉన్న పేద రోగులకు కేటాయించి ఉచితంగా వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. అలాగే ఆస్పత్రికి అనుబంధంగా నగరంలో మొబైల్ క్లినికల్ యూనిట్లను నెలకొల్పనున్నారు. ఒక్కో మొబైల్ క్లినికల్ యూనిట్‌లో 19 రకాల డయాగ్నస్టిక్ పరీక్షలు చేయనున్నారు. ఆ ఆస్పత్రి ద్వారా సుమారు 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు.